# మనస్విని

"సుభద్రా! సాయంకాలం పెళ్ళివారొస్తారనుకుంటాను. మనూని కాలేజీకి వెళ్ళొద్దని చెప్పు ఇవ్వాళ"

"అల్లాగే"

"వాళ్ళకోసం పళ్ళూ ఫలహారాలేమైనా తెప్పించు"

"అల్లాగే! అన్నీ చేస్తాను. మీరేమీ కంగారుపడకండి"

"ఏమిటో సుభద్రా! మనూని తలుచుకుంటే నాకేదో దిగులుగా అనిపిస్తుంది" కళ్ళజోడు తీసి తుడిచి, కళ్ళు తుడుచుకుని మళ్ళీ కళ్ళద్దాలు పెట్టుకున్నారు రాఘవేంద్రరావుగారు, బహుశః కళ్ళు చెమ్మగిల్లాయేమో! అప్పుడే తలంటుకుని జుట్టార బెట్టుకుంటున్న మనస్విని ఈ మాటలు విని "ఎందుకు నాన్నా దిగులు? ఇప్పుడు మీకేం తక్కువయ్యిందని? బయట తిరగలేక పోవచ్చు! నన్ను చూసిన వాళ్ళంతా 'ఫలానా, డాక్టర్ రాఘవేంద్రరావుగారి అమ్మాయి మీరేనా? మీ నాన్న ఎంత గొప్పవాడనుకున్నారూ! గజేంద్రమోక్షం, భగవద్గీత, సుందరకాండ ఆయన



కథా నిలయం
శ్రీకాకుళం

చెపుతూవుంటే మాకు వళ్ళు తెలిసేదికాదు చెవులు నిక్కపొడుచుకుని అక్షరం ఎక్కడ జారిపోతుందోనని వినేవాళ్ళం. మహాపండితుడు, మహాజ్ఞాని కదండీ ఆయన. పాపం భగవంతుడు ఆయనకి అన్యాయం చేశాడు" అంటారు. అంతమంచి పేరున్న నీకు ఎందుకు దిగులు నాన్నా!" అతని మంచానికి దగ్గరగా కూర్చి లాక్కుని కూర్చుని జుట్టుచిక్కు తీసుకుంటూ అంది మనస్విని.

"నీలాంటి కూతుర్ని కన్నందుకు నాకు ఎంతో గర్వంగా వుందమ్మా! అందాన్నీ, మంచితనాన్నీ సమపాళ్ళలో కలబోసి మనసున్న మనిషిగా సృష్టించాడమ్మా భగవంతుడు నిన్ను. కానీ నీ మొహాన కళ్యాణగీత దిద్దడమే మర్చిపోయుంటాడు" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూంటే మరి మాట్లాడలేక పోయారు.

"నాన్నా జీవితంలో పెళ్ళొక్కటేనా ముఖ్యం? చదువూ, వుద్యోగం ఈ రెండూ వున్నాయిగా? నీ అడుగుజాడల్లో నడిచే అదృష్టం కలిగితే చాలు! అంతకన్నా ఏం కావాలి?"

"అమ్మా! అలా అనకు. చదువూ సంపదా ఎంత వున్నా వివాహం జరగందే జీవితానికి పరిపూర్ణత్వం లభించదమ్మా. ముఖ్యంగా స్త్రీ పిల్లాపాపల్తో కలకల్లాడుతూంటేనే మరింత అందంగా. సంతృప్తికరంగా వుంటుంది. లేకపోతే పూతా కాతా లేని మోడులాగా వుంటుంది. అమ్మా, నేను కన్ను మూసేలోగా నీ మెళ్ళో పసుపుతాడు చూడాలి. నీ ఒళ్ళో చంటిపాపను చూడాలి, లేకపోతే నేను ప్రశాంతంగా చచ్చిపోలేనమ్మా .." భుజానవున్న కండువా తీసి చెంపలమీదుగా కారుతూన్న కన్నీళ్ళు తుడుచుకున్నారు, రాఘవేంద్రరావుగారు. తండ్రి ఆవేదన చూసి అల్లాడిపోయింది

మనస్విని. ఆయన కోర్కె తీర్చమని భగవంతుని మనసులోనే ప్రార్థించింది. ఆర్ద్రమైన కళ్ళని పమిటచెంగుతో తుడుచుకుంటూ "ఇప్పుడే వొస్తాను నాన్నా" అంటూ అవతలికి వెళ్ళిపోయింది.

"బంగారుతల్లి, ఎవడు చేసుకుంటాడో వాడు అదృష్టవంతుడు. నా తల్లి సుగుణాల రాసి" అంటూ తనలో తను గొణుక్కుంటున్నట్టుగా మాట్లాడుతూ వాలు కుర్చీలో వాలిపోయారు రాఘవేంద్రరావుగారు.

o o o

మనూ కాలేజీకి సెలవు చీటీరాసి పక్కింటి సుజాతకిచ్చింది. ప్రిన్సిపాల్ గారికిచ్చెయ్యమని. సుజాత నవ్వుతూ చిన్నగా "మేడమ్! పెళ్ళి చూపులా" అంది. "పో గడుగ్గాయి పిల్లా" అంది నవ్వుతూ మనస్విని "నేనెక్కడికి పోతాను, పెళ్ళైపోతే మీరే వెళ్ళిపోతారు" అంది సుజాత. "నువ్వుమాత్రం ఎన్నాళ్ళుంటావు పెళ్ళయ్యాక నువ్వూ ఎక్కడికో వెళ్ళి పోవాల్సిందే" అంది. "అమ్మో వెళ్ళను! నేను అందులో ఈ వూరు వొదిలి అసలే వెళ్లను." అసలు వెళ్ళిపోవడం అన్న మాటే ఇష్టంలేక అదోలా మొహంపెట్టి అంది సుజాత, "ప్రతీ ఆడపిల్లా అలాగే అనుకుంటుంది సుజాతా. కానీ పెళ్ళయిన మరుక్షణం తనఇంటికి తనే పరాయిదైపోతుంది. మెట్టినిల్లే తనిల్లవుతుంది సరేలే! వెళ్ళు టైమవుతోంది. మరిచిపోకుండా ఉత్తరం ఇచ్చేయ్ ప్రిన్సిపాల్ గారికి" అంది.

"అలాగే మేడమ్" అంటూ వెళ్ళిపోయింది సుజాత. సుజాత మనస్విని స్టూడెంటు! బి. ఏ. మొదటి సంవత్సరంలో వుంది. స్వతంత్ర భావాలు కలది "ఆడపిల్లనీ, మొగపిల్లనీ సమానంగా కని పెంచిన తరు

పాత, ఆడపిల్లలకి పెళ్ళి చేసెయ్యగానే వాళ్ళు మరో ఇంటివాళ్ళు అనడా అన్యాయంకదూ!" అంటుంది సుజాత. "దక్షుని పుత్రిక పార్వతి సైతం పరమశివుని పెళ్ళాడాక పుట్టింటిని తన ఇంటిగా అనుకోలేకపోయింది. ఇక దేవతలకే తప్పనప్పుడు మానవులకి సాధ్యమవుతుందా? అంతేకాదు సృష్టికి మూలకారణమైన స్త్రీ మరో ఇంటికి వెళ్ళడంచేత, ఆ ఇంటిని వృద్ధి లోకి తెచ్చినదవుతోంది" అంటూ మనస్విని నచ్చజెప్పినా సుజాత మాత్రం అంగీకరించేదికాదు. పక్క ఇళ్ళే అవడంవల్ల మనస్వినికి తనతో మాట్లాడటం సరదాగానే వుంటుంది. ఆలోచిస్తూ కూర్చున్న మన స్విని రాజశేఖరం బాబాయి రావడం చూసి లేచి నుంచుని, "ఏం బాబాయ్, మళ్ళీ మామూలేనా? కాఫీలూ, టిఫిన్లు మర్యాదలు చేయడం అంతా నచ్చిం దంటూ, కట్నాలూ కానుకలలిస్టు పల్లించడం మనం వెనక్కి తగ్గడం నాన్న గారికి బెంగ ఎక్కువై బి.పి. పెరిగిపోయి జబ్బు మరింత ఎక్కువవడం ఇదంతా మామూలేగా!" జుట్టు ముడివేసుకుంటూ అదోలా నవ్వుతూ అంది మనస్విని.

"అలా అనకు మనూ. ఆడపిల్ల పెళ్ళన్నాక ఇవన్నీ తప్పుతాయా? మామూలేగా!" తేలిగ్గా అనేశారు రాజశేఖరంగారు. ఆదేదో పెద్దవిశేషం కాదన్నట్టు. "హుఁ...! ఎంత ఇదిగా కొట్టిపారేశావ్ బాబాయ్ ఇదేదో మామూలు విషయమైనట్టు"

"మామూలు విషయమే కదమ్మా. ప్రతీ ఆడపిల్లకీ పెళ్ళిచూపులు తప్పవుగదా మరి!"

"సంతలో వస్తువుని చూపించినట్టు చూపించడం. పిల్ల నల్లగావుంటే ఎక్కువ కట్నం, లావుగా వుంటే ఎక్కువ కట్నం, ఇలా పెళ్ళికొడుకు

తరఫువారు నిర్ణయించడం, పైగా యక్షప్రశ్నలు వేసి చంపడం, ఇది న్యాయమా బాబాయ్ చెప్పు?" ఘాటుగా అంది మనస్విని ఉపన్యాస ధోరణిలో.

"పెళ్ళిచూపులంటే అసలు పెళ్ళికొడుకుని పెళ్ళికూతురువాళ్లు చూసి విషయాలు తెలుసుకోవడం ఒకరినొకరు చూసుకోవడానికీ, మాట్లాడుకోవటానికీ ఏర్పరచిన వేదిక అన్నమాట. కానీ, దురదృష్టం. అది పెళ్ళికొడుకువారికి ఏర్పరచిన వేదికకింద మారిపోయి పెళ్ళికూతురు వాళ్ళకి మాట్లాడడానికి వీల్లేకుండా పోయింది. ఇంతకీ వీటన్నిటికీ బోలెడన్ని ఇతర కారణాలున్నాయి. ఏం చేస్తాం" అన్నారు. జేబులోనుంచి సిగరెట్టు తీసి వెలిగిస్తూ రాజశేఖరంగారు.

వంటింట్లోంచి ఇతని కంఠం విన్న సుభద్రమ్మ ఎంతకీ ఇతను లోపలికి రాకపోవటంతో తనే కాఫీగ్లాసుతో ముందుకొచ్చి "ఏమయ్యా మరదీ! లోపలికి రావడంలేదా? అమ్మాయితో కబుర్లుచెబుతూ కూర్చుంటే అయిపోయిందా?" అంది నవ్వుతూ.

"ఒస్తున్నా వదినా! మనస్విని ప్రశ్నలకి సమాధానం చెప్పకపోతే బతుకుతానా?" అంటూ కాఫీగ్లాసందుకుని, రాఘవేంద్రరావుగారి మంచం దగ్గరికి వెళ్ళాడు రాజశేఖరం.

"ఒరేయ్ రాజూ ఒచ్చావా? ఏదో భయంగా వుందిరా ప్రతిసారీ ఈ వెధవ కట్నాలదగ్గరే ఏదో ఒకటి! మనమా దమ్మిడీ కట్నం ఇచ్చుకునే స్థితిలో లేము. పెళ్ళిఖర్చులు కూడా దాని సంపాదనలోంచే పెట్టి చెయ్యాలి. ఎంత దౌర్భాగ్యస్థితిలో వున్నానురా"

"అది సరే అన్నయ్యా? కానీ మనూకి పెళ్ళయి వెళ్ళిపోతే మీకు ఇల్లు గడిచేదెలా మంజులా. దాని ఇద్దరు పిల్లలు ఎలా బతుకుతారు? పెన్షను డబ్బుతో వాళ్ళకి నాలుగురోజుల తిండికూడా రాదు. నేనా? నా సమస్యలతోటే గిలగిల కొట్టుకుపోతున్నాను"

"రాజూ! దీనికి ఒక్కటే పరిష్కారం ఆలోచించాను, మంజుల పిల్లల్ని ఏదైనా శరణాలయంలో చేర్పిస్తాను ఇక్కడొకటుందిగా. మన సికింద్రాబాదులో అందులోవుంటే వాళ్ళు చదువుకుంటారు. అక్కడే మంజులకి ఆయాగానైనా ఉద్యోగం ఒస్తే చాలు పిల్లలతోపాటు అక్కడే వుంటుంది.''

"అన్నయ్యా!" ఆవేశంతో అరిచాడు రాజశేఖరం.

"మరేం చెయ్యను? నిక్షేపంగా, ఆ రోజుల్లో నా కున్న దాంతో పెళ్ళిబాగానే చేశాను ఆ దరిద్రుడు ఇద్దరు పిల్లల్నికని, పిల్లల్నీ దాన్నీ నా ఇంటిమీదికి పంపేసి మరోదాంతో ఊరేగుతున్నాడు. పోనీ మంజుల కూడా, మనస్వినిలా చదువుకుంటే ఏదో ఉద్యోగం చేసుకుంటూ, దాని బతుకు అది బతికేది" కంట తడి పెట్టుకున్నాడు రాఘవేంద్రరావు.

"ఊరుకో అన్నయ్యా! దానిరాత అలా వుంది. నువ్వేం చేస్తావ్? దానికి చదువు చెప్పించనన్నావా? మనూతో పాటు దాన్నీ బడికి పంపావ్. దానికి చదువబ్బలేదు. దానికితోడు పెళ్ళి ఇలా అయిపోయింది."

"అంతా నా ఖర్మరా"

"చక్కగా ఇద్దరే పిల్లలు, నాలాగా పదిమందిలేరు, ఆడపిల్లలైనా

వాళ్ళకి పెద్దచదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేసి పంపించేస్తే నీకేబాధా వుండదనుకున్నాను. కానీ భగవంతుడు నీకు అర్థాంతరంగా ఇన్ని రోగాలిచ్చి జబ్బు మనిషిని చేస్తాడనీ, చదువు లేకపోయినా లక్షణంగా పెరిగిన మంజుల పెళ్ళి ఇలా అయిపోతుందనీ, మనూ పెళ్ళే ఒక సమస్యై పోతుందనీ కల్లో కూడా అనుకోలేదు" బాధగా అన్నాడు రాజశేఖరం.

"అంతా నా దురదృష్టం"

"మనూ బంగారుబొమ్మ! చదువుల సరస్వతి ఏ అదృష్టవంతుడికి రాసి పెట్టుందో" మాట మారుస్తూ అన్నాడు రాజశేఖరం.

అంతలో వంట పూర్తిచేసొచ్చింది సుభద్రమ్మ. మంజుల ఇంట్లో లేదు. పిల్లపెద్దరికి బాగా దగ్గు, జలుబుగా వుందని, డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళింది. తలుపుచాటునుంచి తండ్రీ బాబాయ్ల సంభాషణ వింటున్న మనూ తల్లి అటుకేసి రావడంచూసి, పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

ం ం ం

సాయంత్రం ఆరింటికల్లా, ఉప్మా, కాఫీ డికాక్షనూ సిద్ధం చేసింది సుభద్రమ్మ. రాజశేఖరం బజారుకెళ్ళి జిలేబీ కొనుక్కొచ్చాడు. మంజుల మనూకి తలదువ్వి చక్కగా జడవేసింది. దొడ్లో పూచిన సన్నజాజులు మాలకట్టి, పెద్దచెండు తలనిండా పెట్టింది. మనూ ఎంతో ముచ్చటపడి క్రిందటేడు దీపావళికి కొనుక్కున్న ముదురాకుపచ్చ గులాబీరంగు పట్టు చీర, ముదురాకుపచ్చ జాకెట్టు కట్టుకుంది. కళ్ళనిండా కాటుక, నుదుటన తోపురంగు కుంకుమబొట్టు, అప్సరసలా వుంది మనూ.

"నా దిష్టే తగులుతుందేమోనే వుండు చిన్నసల్లచుక్క కనబడ కుండా బుగ్గమీద పెడతాను" అంటూ ఒద్దన్నా వినకుండా పెట్టింది మంజుల "ఈ దెబ్బతో పెళ్ళికొడుకుకి నిన్ను చూడగానే మతిపోతుంది. పెళ్ళి ఖాయం. కట్నం గిట్నం ఏమీవొద్దు ఆ పిల్లకావాలి అంటాడు" తృప్తిగా నవ్వుతూ అంది మంజుల. మనూ మంజుకేసిచూసి ఆమె అమా యకత్వానికి, మంచితనానికి మనసులోనే జోహారు లర్పిస్తూ చిన్నగా నవ్వింది.

అంతలో బయట టాక్సీ ఆగిన చప్పుడు కాగానే రాజశేఖరంగారు బయటికి వెళ్ళారు, సుభద్రమ్మా వెనకాలే వెళ్ళింది. మంజుల పిల్లల్ని "గొడవ చెయ్యొద్దు"అంటూ లోపలికి తీసుకెళ్ళింది.

సుబ్బారావుగారూ భార్య కమలమ్మ, పెళ్ళికొడుకు శ్రీమాన్, రాజశేఖరంగారి వెనకాలే వచ్చారు. రాఘవేంద్రరావుగారి గదిలోనే ఆయన లేచి రాలేరు కనుక చాపవేసి అందర్నీ కూర్చోబెట్టింది సుభద్రమ్మ.

"వొదిరా! కాఫీలు పట్టుకురా" రాజశేఖరం సుబ్బారావుగారి పక్కనే కుర్చీ లాక్కుని కూర్చుంటూ అన్నాడు. సుభద్రమ్మ గబగబా లోపలికెళ్ళి మూడు ప్లేట్లలో ఉప్మా పెట్టి. మంచినీళ్ళ గ్లాసులు పట్టుకొచ్చి పెట్టింది. ఒద్దు వద్దంటూనే ఉప్మా ప్లేట్లందుకున్నారు అందరూ. "అమ్మా యిని తీసుకురండి" అంది కమలమ్మ. వెంటనే మంజుల మనూని చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి కూర్చోబెట్టింది. తలవంచుకుని తడబడే అడుగులతో మనూ వస్తుంటే ఏదో వెలుగు ఆ గదిలోకి ప్రవేశించినట్టుగా అనిపించింది. శ్రీమాన్ ఓరకంట మనూనే చూస్తున్నాడు. ఖాళీ ఉప్మా ప్లేట్లనీ, గ్లాసు

లనీ తీసికెళ్ళి లోపలపెట్టి, కాఫీపట్టుకొచ్చింది మంజుల. "నీ పేరేమిటమ్మాయ్" అంది కమలమ్మ. ఇంతకు ముందు తెలీనట్టు.

"మనస్విని" నవ్వుతూ చెప్పింది.

"ఎక్కడ పనిచేస్తున్నావ్?"

"గాంధీజీ కాలేజీలో"

"తెలుగు లెక్చరర్ కదూ?"

"అవునండి"

"బాబూ! నువ్వేమయినా ప్రశ్నలడుగుతావా!"

శ్రీమాన్ ఊరుకున్నాడు.

"కాదు అడుగూ" అన్నారు అందరూ ఒక్కసారే రాఘవేంద్రరావుగారూ, రాజశేఖరంగారూ, సుబ్బారావుగారూ. శ్రీమాన్ మళ్ళీనవ్వేసి ఊరుకున్నాడు మనసూ అతనిని క్రీగంట చూస్తూనేవుంది. తెల్లగా, అందంగానే వున్నాడు. పెద్ద క్రాపూ, సూటూ బూటూ. సినిమా హీరోలాగానే వున్నాడు "అమ్మాయి నచ్చిందేమో కనుక్కోండి" ఆతృతగా అడిగారు రాఘవేంద్రరావుగారు సుబ్బారావుగారిని చూసి.

"శ్రీమాన్ చెప్పు పిల్లనచ్చిందా?"

శ్రీమాన్ అవునన్నట్లు తలవూపాడు.

"ఇంకేం అయితే మిగతా విషయాలు మాట్లాడుకోవాలి" అన్నారు రాజశేఖరం.

"మాకు కట్నకానుకలమీద ఆశలేదండి మా శ్రీమాన్‌కి కట్నాలు తీసుకోవడమంటే పరమ అసహ్యం" గర్వంగా అంది కమలమ్మ.

"ఈ రోజుల్లో మీలాంటివాళ్ళు వుండటం అరుదు" అంది సుభద్రమ్మ సంతోషంతో.

"మా బాబుకు చదువుకున్న అమ్మాయి, ఉద్యోగంచేసే అమ్మాయి కావాలి మంచి సాంప్రదాయం, అందం కలిగి వుండాలి. ఇవ్వే కోరుకున్నాడు మిగతా విషయాలతో మాకు సంబంధంలేదు."

"అదృష్టం మీలాంటివాళ్ళు దొరకడం" ఉబ్బితబ్బిబ్బవుతున్నారు రాఘవేంద్రరావుగారు.

"మనూ! నీకిష్టమేనా ఈ సంబంధం?" రాజశేఖరంగారడిగారు.

"బాబాయ్! ఒక్కసారి నేను విడిగా వారితో మాట్లాడాలి" పెళ్ళి కొడుకుని చూపిస్తూ అంది మనూ.

అందరూ ఆశ్చర్యంగా ఆమెకేసి చూశారు.

శ్రీమాన్ చిరునవ్వుతో "ఎస్! ఇక్కడ కూర్చుందాంరండి" అంటూ వరండాలో వున్న కుర్చీలవైపు చూపించాడు లేచి నుంచుంటూ.

మనూలేచి వరండావైపు వెళ్ళింది.

అందరూ అదోలా ఆమెకేసి చూస్తూ వుండిపోయారు మనూ తీసుకున్న చొరవ ఎవరికీ నచ్చనట్టు. వరండా పూర్తిపక్క కుండటం వల్ల అక్కడ కూర్చున్నవాళ్ళు గదిలోవాళ్ళకి కనిపించరు. "కూర్చోండి" అంది

మనూ శ్రీమాన్‌కి కుర్చీ చూపిస్తూ. అతను ఇంటర్వ్యూకి వచ్చిన వాడిలా బెరుకుగా కూర్చున్నాడు "ఈ మగాళ్ళెప్పుడూ ఇంతేనేమో! ఆడపిల్ల బెదురుతూవుంటే ఏడిపిస్తారు ధైర్యంగా చొరవ తీసుకుంటే బెదిరిపోతారు" అనుకుని చిన్నగా నవ్వుకుంది. "మీ నవ్వు చాలా అందంగా వుంటుంది" ఎలాగో గొంతు పెకలించుకుని అన్నాడు శ్రీమాన్. "థాంక్యూ" కొంటెగా చూస్తూ అంది మనూ "నేను మీకు నచ్చానా?" శ్రీమాన్ కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది. "చాలా నచ్చారు" నవ్వుతూ సమాధానం చెప్పాడు శ్రీమాన్. "మాది మధ్యతరగతి కుటుంబం. ఒక రకంగా పేదవాళ్ళమనే చెప్పొచ్చు" అంది చీరకొంగును చేతికి చుట్టుకుంటూ మనూ. "ధనంలో కావచ్చు. కానీ అందంలోను, సంస్కారంలోను చాలా ధనవంతులనే చెప్పొచ్చు" చిలిపిగా చూస్తూ అన్నాడు శ్రీమాన్.

"కానీ వాటివల్ల ఏం లాభం?"

"ఎందుకు లేదు కట్నకానుకల బెడద లేకుండా పెళ్ళి జరిగిపోతుంది,"

పెద్దగా నవ్వింది మను.

"ఎందుకు నవ్వుతున్నారు" అర్థంకాక అడిగాడు శ్రీమాన్.

"అందమైన ఆడపిల్లయితే కట్నంగొడవ లేదన్నారు. మరి మగాడు అనాకారి అయితే ఎదురుకట్నం ఇస్తారా?" కొంటెగా నవ్వుతూ అడిగింది.

అనుకోని ఈ ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు శ్రీమాన్‌కి. అది గ్రహించిన మనూ "పోనీలెండి గానీ అసలు మీరెందుకు ఉద్యోగంచేసే అమ్మాయే కావాలనుకున్నారు?" అడిగింది.

"ఈ రోజుల్లో ఒకరి సంపాదనమీద ఇల్లు గడవడం కష్టం కాబట్టి! భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తేనే కాని సంతోషంగా వుండడం కష్టం"

"ఒకవేళ మీ కన్నివిధాలా నచ్చిన అమ్మాయికి ఉద్యోగం, సంపాదనా లేకపోతే?" శ్రీమాన్ పెద్దగా నవ్వుతూ,

"ఆ ప్రశ్న లేనేలేదుగా! ఎందుకంటే నాకు నచ్చింది మీరేకనుక! మీకు ఉద్యోగమూ సంపాదనా వున్నాయి కదా!"

శ్రీమాన్‌గారూ! ఒకవేళ నాకు సంపాదన లేదని తెలిస్తే, నన్ను పెళ్ళి చేసుకుంటారా?''

శ్రీమాన్ అయోమయంగా ఆమెకేసి చూస్తూ, "మీరేమంటున్నారో నాకర్థం కావడంలేదు. లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూన్న మీకు సంపాదన లేకపోవడమేమిటి! నేనూ మీలాగే ఎమ్. ఏ. ప్యాసయినా, నేను పని చేస్తూన్న కంపెనీ చాలా చిన్నదికాబట్టి, బహుశ నాకన్నా మీకే ఎక్కువ జీతం వస్తోందేమో కూడా" నవ్వుతూ అన్నాడు. మనోతలెత్తి అతని కేసి చూసి నిట్టూరుస్తూ, "శ్రీమాన్ గారూ! మీరన్నది నిజమే! కాని, మా ఇల్లు నా సంపాదనవల్లే నడుస్తోంది. నాన్నగారు మంచంపట్టారు అక్కని బావగారు ఇక్కడే వదిలేశారు. ఆమె పిల్లలూ, అమ్మా, అందరూ నా మీదే ఆధారపడివున్నారు. నేను నా సంపాదన ఇవ్వడం మానేస్తే, మా వాళ్ళందరూ ఒక రకంగా అనాథలై పోతారు" శ్రీమాన్ కళ్ళలోకి చూస్తూ చెప్పింది. అతను మౌనంగా వింటున్నాడు. చూడండీ ఇది కేవలం అభ్యర్థన మాత్రమే. పెళ్ళయ్యాకకూడా మీ సంపాదనతో మీకు మీవాళ్ళని పోషిస్తున్నట్టు, నా సంపాదనతో నన్ను మావాళ్ళని పోషించుకోనివ్వండి. ఏమంటారు?'"

శ్రీమాన్ మౌనంగా వూరుకున్నాడు. "మీసంపాదనతో మనం సర్దుకోవచ్చుగా! కొన్నాళ్ళు మా అక్క పిల్లలెవళ్ళయినా కాస్తంత చేతికొచ్చేంత వరకే! ఆ తరువాత మనం హాయిగా వుండొచ్చును, సంతోషంగా సంసారం చెయ్యడానికి ధనం ఒక్కటే ప్రధానం కాదండి. ధనం అవసరమే, కాదనను ఆ అవసరానికి మీ సంపాదన ఉందిగా!'' శ్రీమాన్ ఏమీ సమాధానం చెప్పకపోయేసరికి మనూ ''మిమ్మల్ని వెంటనే సమాధానం చెప్పమని అడగడంలేదు ఆలోచించుకుని చెప్పండి'' అంది.

''ఊఁ...'' అన్నాడు మెల్లగా లేచినుంచుని.

"అయిందా మీ మాటలు? రాజశేఖరంగారు నవ్వుతూ అన్నారు.

మనూ నవ్వుతూ తలవంచుకు నుంచుంది.

''ఇంక వెళ్ళొస్తామండి" అన్నారు సుబ్బారావుగారులేస్తూ.

''ఏ సంగతీ తొందరలోనే తెలియ జెయ్యండి'' రాఘవేంద్రరావుగారన్నారు.

''అలాగే!'' అంటూ సుబ్బారావుగారు ముందుకు సాగారు. వాళ్ళని గేటుదాకా పంపించి వచ్చారు రాజశేఖరంగారూ, సుభద్రమ్మ.

రోజులూ, వారాలూ, నెలలు దాటాయి. వారిదగ్గరనుంచి సమాధానం రాలేదు ''పిల్లనచ్చిందన్నారు, కట్నం అక్కర్లేదన్నారు' మరి పెళ్ళికెందుకు ఒప్పుకోలేదో అర్థంకాలేదు ఎవ్వరికీ, ఒక్క మనూకి తప్ప ఒకరోజు పోస్టులో ఒక శుభలేఖతోపాటు చిన్న ఉత్తరంకూడా వొచ్చింది. చిరంజీవి శ్రీమాన్‌కీ, చిరంజీవి శైలజ, ఎమ్.ఏ, లెక్చరర్ ఇన్ ఉమెన్స్ కాలేజీ'' మరి చదవలేకపోయారు రాఘవేంద్రరావుగారు కిందపెట్టేశారు. 'సుబ్బారావు, కమలమ్మ' కళ్ళు కనిపించలేదు రాఘవేంద్రరావుగారికి. కన్నీళ్ళు నిండిపోయాయి ఉత్తరం విప్పి చూశారు,

మనస్విని గారికి,

నమస్కారం! కండువాతో కళ్ళు తుడుచుకుని, తన ఉత్తరం కాదని తెలిసికూడా సంస్కారాన్ని చంపుకుని. చదవడం మొదలెట్టారు. సుభద్రమ్మ, అప్పుడే కాలేజీ నుంచొచ్చిన మనూకూడా విషయం తెలుసుకుని: అతని మంచం దగ్గర కూర్చున్నారు. "పెద్దగా చదవండి నాన్నా" అంది మనూ.

మనస్విని గారికి,

నమస్కారం మీరడిగిన విషయం గురించి పదే పదే ఆలోచించాను కానీ మీకు నచ్చిన విధంగా నిర్ణయం తీసుకోలేక పోయాను. మీ అక్క పిల్లలు పెద్దవాళ్ళయ్యేదాకా, మీ సంపాదన మీ కుటుంబానికి ఇస్తే ఈలోగా బహుశః నేను రిటైరయిపోతాను. ఎందుకంటే వాళ్ళకింకా అయిదారేళ్ళే కదా! లేదా మీరూ రిటైరయిపోతారు. ఈలోగా మనకీ పిల్లా జల్లా పుడతారు. నా ఒక్కడి సంపాదనలో వాళ్ల ముచ్చటేం తీరుస్తాం? అంత త్యాగం నేను చెయ్యలేను. ఏమయినా శ్రీమంతులయితే చేస్తారేమో బహుశః ఈలోగా శైలజ సంబంధం వచ్చింది పిల్ల మీఅంత అందంగా కాకపోయినా బాగానేవుంది. మా పెళ్లి కుదిరి పోయింది. మా పెళ్ళికి మిమ్మల్ని రమ్మని పిలవలేను. కానీ, మీ కోరిక తీర్చే వారెవరితోనైనా మీ పెళ్ళి త్వరగా కుదరాలని కోరుకుంటున్నాను.

ఉంటా,
శ్రీమాన్

ఉత్తరం పూర్తిచేసి గుండె చేత్తో పట్టుకుని మంచంమీదకి వాలిపోయారు రాఘవేంద్రరావుగారు. "నాన్నా ... నాన్నా ... కంగారుగా

మంచం దగ్గరికెళ్లి అతన్ని కదుపుతూ పిలిచింది మనస్విని. మంజుల వెక్కి వెక్కి ఏడుస్తోంది. సుభద్రమ్మ "ఏమండీ! ఏమయింది?" అంటూ అయోమయంగా చూస్తోంది. కన్నీళ్ళు చెంపలమీదుగా జారి చీరని తడి పేస్తుంటే రాఘవేంద్రరావుగారు మెల్లగా కదిలారు. "మనూ ఎంతపని చేశావమ్మా" అంటూ.

"మర్చిపోండి నాన్నా మీకెలా వుంది" అంది పక్కనేకూర్చుంటూ మనూ.

"ఎలా వుంటుందితల్లీ! లక్షణమైన సంబంధం చేతులారా పోగొట్టుకున్నావ్" తల నిమురుతూ అన్నారు.

"పోనీండి నాన్నా మీరనవసరంగా మనసు పాడు చేసుకోకండి" అంది అతని కళ్ళు తుడుస్తూ.

"ఎందుకమ్మా! మా కోసం అంతత్యాగం చేశావు" పసిపిల్లాడిలా ఏడుస్తూ అన్నారాయన.

"మనూ! నేను దురదృష్టవంతురాలిని నా భారం. అమ్మానాన్నలని కుంగదియ్యడమే కాదు, చివరికి, నీ జీవితాన్ని నాశనం చేస్తోంది. నేనూ నా పిల్లలు ఈ వూరు విడిచిపోతేనే గానీ. నీ జీవితం బాగుపడదు" వెక్కి వెక్కి చేతుల్లో మొహం దాచుకుని ఏడుస్తూ అంది మంజుల.

"అక్కా! ఇంకోసారి ఈ మాటంటే నన్ను చంపుకు తిన్నంతఒట్టే! అసలు నాకు పెళ్ళి ఇష్టంలేదు. మనసమాజంలో పురుషుడికో న్యాయం, స్త్రీకో న్యాయం వున్నంత వరకు, ఈ వ్యవస్థ మారనంత వరకు నాకు పెళ్ళంటే ఇష్టంలేదు. తన తమ్ముడి చదువుకోసం, తనచెల్లెలి పెళ్ళికోసం తనవారి సుఖంకోసం భార్య సంపాదనని ఆశిస్తున్నాడు మగవాడు. అదే

స్త్రీ ఎందుకు కోరుకోకూడదూ? తన తోడబుట్టినవాళ్ళకీ కన్నవారికీ సాయపడే హక్కు స్త్రీకి లేదా? కట్నం తీసుకుంటే ఒక్కసారే ఖర్చయిపోతుంది. భార్య ఉద్యోగస్తురాలయితే, సంపాదన నెల నెలా వుంటుంది. పురుషుడు నిజంగా స్వార్థపరుడు - పురుషుడే కాదు. మన సమాజం. ఆఫ్‌కోర్స్ సమాజంలో సగభాగం పైగా పురుషులే కదా! పెళ్ళాం తరపు వారిని ఆదరిస్తే "హెన్...పెక్...డ్" అంటారు. లేదా ఏదో బాధపడి పోతారు అతని తాలూకువాళ్ళు. అవసరం అయినప్పుడు. తప్పని సరయితే, ఆ మాత్రం త్యాగం చేస్తేతప్పా? నాన్నా! నాకసలు పెళ్ళక్కర్లేదు. నా సంపాదన అక్కర్లేకుండా, నేనే కావాలనుకునే వాడొచ్చినప్పుడే నేను పెళ్ళి చేసుకుంటాను." ఆవేశంగా చెబుతున్న మనూకేసి అందరూ గుడ్లప్పగించి చూడ్డం తప్ప ఏం చెయ్యగలరెవరైనా? ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి? ఈ ప్రశ్నలు అందరి బుర్రల్లోనూ గిరిగిరి తిరుగుతూంటే, బరువెక్కిన హృదయంతో, నోట మాట రాక మూగగా వుండిపోయారు అందరూ!

— X —